మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# పేద విద్యార్థులకు "యెన్నం" అండ..

**వారి చదువుకు ప్రోత్సహిస్తాం.. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**పేద వైద్య విద్యార్థినికి విద్యానిధి చెక్కు అందజేత**



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 16 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ నియోజకవర్గం మంచన్‌పల్లి తండా (మహబూబ్‌నగర్ మండలం)కు చెందిన కడావత్ వాస్య నాయక్ కూతురు కడావత్ రాజేశ్వరి చేవెళ్లలోని పట్నం మహేందర్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన నేపథ్యంలో విద్యా సహాయార్థం రూ. 25వేల చెక్కును విద్యానిధి నుంచి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ప్రతిభావంతుల చదువు మధ్యలో ఆగిపోకుండా చూడటం ప్రజాప్రతినిధులుగా తమ బాధ్యత అని ఆయన అన్నారు. రాజేశ్వరి మంచి విజయాలతో ముందుకు సాగి, భవిష్యత్తులో పేదలకు, అవసరమైన వారికి నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్లొద్దు

**జిల్లా ఎస్పీ డా. వినీత్ హెచ్చరిక**

**నారాయణ పేట, నవంబరు 16 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ప్రజలు మల్టీ లెవెల్ మార్కెటింగ్ ఎమ్ఎమ్ఎల్ పేరుతో సైబర్ నేరగాళ్ల ప్రజల బలహీనతలను ఉపయోగించుకొని మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. త్వరిత లాభాలు రివార్డులు పాయింట్లు లగ్జరీ కార్లు ఫారిన్ టూర్లు వాగ్దానం చేస్తూ అమాయకులను వలలో పడేస్తున్నారని ఎస్పీ తెలిపారు. గొలుసుకట్టు వ్యాపారాల్లో ముందుగా చేరిన కొందరికి మాత్రమే లాభాలు వస్తాయి కానీ తరువాత చేరినవారు భారీగా నష్టపోతారని హెచ్చరించారు. వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా వ్యాపార ప్రకటనలు చేస్తూ డబ్బు దోచుకునే కొత్త పద్ధతులు నేరగాళ్ల అవలంబిస్తున్నారని చెప్పారు. అతి తక్కువ కాలంలో అధిక లాభాలు వస్తాయని ఎవరు చెప్పినా అది మోసమని గ్రహించాలని సూచించారు. సందేహాస్పద ప్రకటనలు వెబ్ లింకులు ఈ పీకే ఫైల్లు డౌన్‌లోడ్ చేయకూడదని మల్టీ లెవెల్ వ్యాపారాల సభలు సమావేశాలకు హాజరు కావొద్దని ఎస్పీ సూచించారు. ఆర్థిక మోసాలకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

## రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

**మహబూబ్‌నగర్ రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

**హన్వాడ,వెన్నచేడ్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రము, ప్రభుత్వ షెడ్యూల్డ్**

**కులాల బాలుర వసతి గృహం తనిఖీ**



కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 16 ప్రభాతవార్త:** గండీడ్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో హన్వాడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్ తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్ళు నిర్వహించాలని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆయన సూచించారు. ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. గండీడ్ మండలం వెన్న చేడ్ గ్రామంలో షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించి శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలు పరిశీలించారు. విద్యార్థులు చదువుపై అశ్రద్ధ వహించవద్దని, చదువుతో జీవితంలో ఉన్నత స్థానం చేరుకుంటారని అన్నారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ట

**కొల్లాపూర్, నవంబరు 16 ప్రభాతవార్త :** నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండలం రాజాపూర్ గ్రామ శ్రీశ్రీశ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయము శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ట కంటే ముందు గణపతి ఇంద్ర దిగ్పాలకుల పూజ,కూర్మండం, ఆంజనేయ హోమం, యంత్రస్టాపణ, అభిషేకం,ప్రత్యేక పూజలు అర్చకులు సుమలత భాస్కరశర్మ, సంతోష్ భరద్వాజ్ పూజలు నిర్వహించి అనంతరం శ్రీ అభయ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. అనంతరం మంగళహారతితో స్వామివారికి తమలపాకు, నిమ్మ కాయ, పూలమాలతో అలంకరించి నైవేద్యం సమర్పించారు.భక్తులు పంతులు కుర్వ నాగేంద్రం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహోలంగా ఆలయ ప్రాంగణంలో జైశ్రీరామ్, జై హనుమాన్, గోవింద నామస్మరణతో మారు మ్రోగింది. చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన భక్తులు కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు తీర్చుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చీమర్ల ప్రభాకర్ రెడ్డి, మన్నె గోవర్ధన్ రెడ్డి, చీకిరాల పట్టాభి, మన్నెవెంకటరెడ్డి, జైపాల్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, బి.తిరుపతిరెడ్డి, రఘునాథ్ రెడ్డి, ఆర్.రాముడు, మాజీ ప్రజా ప్రతినిధులతో పాటు వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.



ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట దృశ్యం

### నిరుపేదల కళలను నిజం చేయడమే

# ప్రజాప్రభుత్వం లక్ష్యం

**ఇద్గాన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి**

**రాజాపూర్, నవంబరు 16 ప్రభాతవార్త:** నిరుపేదల కళలు నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాజాపూర్ మండలంలోని ఇద్గానిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇదిగానిపల్లి గ్రామంలో 46 కోట్ల రూపాయల వ్యయంతో ఏటీసీ ట్రైనింగ్ సెంటర్‌ను మంజూరు చేసిన్నట్లు ఆయన తెలిపారు. ఈ సెంటర్ ద్వారా గ్రామం అభివృద్ధి దిశలో పయణిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత పాలకులు గ్రామంలో సీసీ రోడ్లు నిర్మిస్తామని చెప్పి శిలాఫలకాలు ఏర్పాటు చేసి వాటిని అలాగే వదిలివేసిన్నట్లు తెలిపారు. 15 రోజుల్లోనే 26 లక్షల వ్యయంతో రెండు సీసీ రోడ్ల పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. తెలంగాణలో ప్రజా ప్రభత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జడ్చర్ల నియోజకవర్గంలో 22 సబ్‌స్టేషన్లతో పాటు ఒక 132 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేసిన్నట్లు తెలిపారు. అంతకుముందు ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెలేను శాలువాలతో ఘనంగా సాన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ జవాజి శేఖర్ గౌడ్, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పంచాక్షరి,శ్రీనివాస్ నాయక్, గోవర్ధన్‌రెడ్డి, భరత్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గోనెల రమేష్, కావలి శివకుమార్, గిరిగౌడ్, మహేందర్, శంకర్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్, ఎంపీడీవో లక్ష్మీదేవి, పలువురు అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఇదిగానిపల్లిలో సీసీరోడ్డు భూమిలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

# ఎమ్మెల్యే తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వాహనం వితరణ

**చేయూత అనాధాశ్రమానికి వాహనం అందజేత.. వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, నవంబరు 16 ప్రభాతవార్త :** వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మరోసారి తన గొప్ప మనసును చాటుకుంటూ తన తల్లిదండ్రులు కీ॥ సాయి రెడ్డి, వెంకటమ్మల జ్ఞాపకార్థం రూ. 6 లక్షల విలువ గల వాహనాన్ని ఆదివారం చిట్యాల చేయూత అనాధాశ్రమానికి అందించారు. కన్న తల్లిదండ్రులను సరిగా చూసుకోని ఈ రోజుల్లో తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆశ్రమానికి వాహనాన్ని అందించి ఎమ్మెల్యే తన గొప్ప మనసును చాటుకున్నారని చేయూత అనాధాశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. చేయూత అనాధాశ్రమం నుంచి గ్రామాలలోని అనాధ వృద్ధులకు భోజనాన్ని అందించేందుకు ఈ వాహనాన్ని ఉపయోగించనున్నట్లు నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. మానవత్వం గల ఇలాంటి గొప్ప నాయకులు కలకాలం ప్రజాసేవలోనే ఉండాలని వారు ఆకాంక్షి ంచారు. ఈ సందర్భంగా అదే అనాథ ఆశ్రమానికి చెందిన 2004 సంవత్సరం అనాధగా చేరిన మాధవి కి జటప్రోలు గోపులాపురం గ్రామానికి చెందిన సందీప్ రెడ్డితో ఆశ్రమ నిర్వాహకులు వివాహం నిర్వహించగా హాజరైన ఎమ్మెల్యే వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలను చేరదీసి వారి బాగోగులు చూసుకుంటూ భవిష్యత్తు బాగును కోరి వివాహం జరిపిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి దంపతులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో వనపర్తి మండల మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మైనార్టీ నాయకులు రహీం, చిన్నమందడి మాజీ సర్పంచ్ సూర్య చంద్రారెడ్డి, అంకుర్ వెంకటరెడ్డి, ఆర్యభవన్ శ్రీనివాస్, వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆదిత్య, కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్, లక్కాకుల సతీష్, సంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమానికి వాహనాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే



జపాన్ దేశస్థులను స్వాగతిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## శ్రీ కురుమన్నను దర్శించుకున్న జపాన్ దేశస్తులు

**చిన్న చింతకుంట, నవంబరు 16 ప్రభాతవార్త :** తిరుమల తిరుపతి వెంకటేశ్వరుడిగా కొలవబడుతున్న శ్రీ కురుమూర్తి స్వామిని జపాన్ దేశస్తులు దర్శించుకున్నారు.స్వామివారి విశిష్టతను తెలుసుకొని ఆదివారం జపాన్ దేశస్తులు స్వామి వారి కొండకు చేరుకొని ప్రధాన మెట్ల మార్గం ద్వారా కొండపై గల శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్నారు. జపాన్ దేశస్తులకు స్వామి వారి విశిష్టతను వివరించి శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదలను అందజేశారు. మీరు హైదరాబాదులో వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. శ్రీ కురుమూర్తి స్వామి పుణ్యక్షేత్రం విశిష్టతను తెలుసుకొని స్వామివారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని విశ్వాసంతో రావడం జరిగిందని వారు తెలిపారు. వీరికి కొండ దిగువన స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి స్వాగతం పలికారు.




చౌకధరల దుకాణాల వద్ద పట్టిక బోర్డు

## రేషన్ దుకాణాలలో స్టాక్ బోర్డు పట్టిక ఎక్కడ..?

**మద్దూరు, నవంబరు 16 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఉమ్మడి మద్దూరు, కొత్తపల్లి మండల వివిధ గ్రామాలలో చౌక ధరల దుకాణాలలో స్టాక్ బోర్డు వివరాలతో కూడిన పట్టికను విధిగా ప్రదర్శించాలి. మొత్తం ఎన్ని కుటుంబాలు ఆహార భద్రతా కార్డులు కలిగి ఉన్నాయి. ఇప్పటివరకు ఎంతమందికి బియ్యం పంపిణీ పూర్తయ్యిం ఇంకా ఎంతమందికి పంపిణీ చేయాల్సి ఉంది, తదితర వివరాలు "స్టాక్ రిజిస్టర్" లో ప్రదర్శించాలని నిబంధన ఉన్నా అవి ఏ రేషన్ డీలర్ పాటించడం లేదు. రేషన్ షాపులోని బియ్యం నిల్వలు, వాటి నాణ్యతను స్టాక్ వివరాల పట్టికను తనిఖీ చేసే అధికారులే" కరువయ్యారు. ఒకవేళ తనిఖీ చేసిన చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు, ప్రభుత్వం పేద కుటుంబాల వారికి "ప్రజా పంపిణీ"వ్యవస్థ ద్వారా ఉచితంగా "సన్న బియ్యం" అందిస్తున్న నేపథ్యంలో..పారదర్శకత కోసం రేషన్ దుకాణాలలో తప్పనిసరిగా స్టాక్ వివరాల పట్టికను ప్రదర్శించాలని నిబంధనలు ఉన్న తుంగలో తొక్కుతున్నారు. ఈ మేరకు ఉమ్మడి మద్దూరు, కొత్తపల్లి మండల వ్యాప్తంగా "అన్ని రేషన్ షాపుల"లో సన్న బియ్యం పంపిణీలో అవకతవకలకు తావు లేకుండా పకడ్బందీగా జిల్లా అధికారులు పర్యవేక్షణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

**జిల్లా డీఎస్ఓ అధికారిని వివరణ కోరగా...**

రేషన్ దుకాణాల్లో స్టాక్ బోర్డు వివరాల ప్రదర్శన తప్పనిసరి. ఎక్కడైనా నిబంధనలు పాటించకపోతే వెంటనే చర్యలు తీసుకుంటాం. సంబంధిత డీలర్లకు నోటీసులు ఇస్తాం. అటువంటి ఫిర్యాదులు మా దృష్టికి వస్తే వెంటనే తనిఖీలు నిర్వహించి, రేషన్ పంపిణీలో పారదర్శకతను కచ్చితంగా అమలు చేస్తాం" అని పేర్కొన్నారు.



డిఎస్ఓ బాలరాజు

## మహబూబ్ నగర్ ఆధ్యాత్మికతకు నిలయం

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 16 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రంగా పేరుగాంచిన అప్పన్నపల్లి శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో శ్రీరామ రక్షా స్తోత్ర-శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్ నగర్ ఆధ్యాత్మికతకు నిలయంగా నిలుస్తోందన్నారు. ఇలాంటి పారాయణ మహాయజ్ఞాలు ప్రజల్లో భక్తిని పెంపొందించడమే కాక సమాజ ఐక్యతకు బలాన్నిస్తాయని ఆయన అన్నారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి, అభివృద్ధితో ఉండాలని శ్రీ అభయాంజనేయ స్వామి వద్ద ప్రార్థిస్తున్నాను" అని అన్నారు. ఈ మహాయజ్ఞం ప్రత్యేకతగా మొత్తం 1116 దంపతులు ఏకస్వరంతో పారాయణంలో పాల్గొనడం విశేషం అని, సామాజిక ఐక్యత, సౌభ్రాతృత్వం, శాంతి-సమృద్ధి వంటి విలువలకు బలాన్నిస్తూ ఈ కార్యక్రమం కీలక మైలురాయిగా నిలిచిందని ఎమ్మెల్యే ప్రశంసించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైభవోపేతంగా నిర్వహించిన ఈ పవిత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఎమ్మెల్యే నిర్వాహక బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జ్ గోనెల శ్రీనివాసులు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, రామాంజనేయులు, శ్రీను, నిర్వాహకులు కొత్తూరు శ్రీనివాస్ రెడ్డి, వావిళ్ల రామిరెడ్డి, హేమసుందరమూర్తి, శ్రీనివాస్ రెడ్డి, సంస్కృత పండితులు నాగరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు ఎవరి బిక్ష కాదు... బీసీల జన్మ హక్కు...

- బీసీ రిజర్వేషన్లు రాజ్యాంగ పరంగా కల్పించాలి...
- బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి...
- బీసీ సంక్షేమ సంఘం కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు మణికంఠ...

**కల్వకుర్తి నవంబర్ 15 ప్రభాతవార్త:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎవరి బిక్ష కాదని అది బీసీల జన్మహక్కు అని రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉన్న 42 శాతం బీసీ బిల్లును తక్షణమే ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు మణికంఠ డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద బీసీ సంక్షేమ సంఘం కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు మణికంఠ, బీసీ సంక్షేమ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ ప్రజాపతి, పొల్యూషన్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీసింగ్‌లు బీసీల న్యాయ సాధన దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీల న్యాయ సాధన దీక్షకు కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జిల్లెల్ల రాములు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్, బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్ యాదవ్, కల్వకుర్తి బీసీ సంఘాల జేఏసీ నాయకులు సదానందంగౌడ్, మేకల రాజేందర్‌లతో పాటు పలు విద్యార్థి సంఘాల నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బీసీ సంక్షేమ సంఘం కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు మణికంఠ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు పార్టీ పరంగా కాకుండా రాజ్యాంగ పరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొన్నారు. న్యాయబద్ధంగా బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని లేనిపక్షంలో బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా బీసీ సంఘాలతో కలిసి పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుక్కాపురం అనిల్, బీసీ విద్యార్థి సంఘం కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు రాజు, నాయకులు గడ్డమీద వెంకటయ్య, దారమోని గణేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు మణికంఠ



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

## బీసీల హక్కుల కోసం
## అన్ని సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలి

**నారాయణ పేట, నవంబరు 16 ప్రభాతవార్త :** నారాయణ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు దగ్గర బీసీ జాగృతి సేన బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న న్యాయ సామాజిక న్యాయ ధర్మదీక్షకు మద్దతుగా బీసీ రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వ విధానాలే ప్రధాన అడ్డంకిగా మారాయని మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్ సిపిఎం జిల్లా కార్యదర్శి జి. వెంకటరామిరెడ్డి సిఐటియు జిల్లా కార్యదర్శి బలరాం విమర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.వెంకటేష్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు ఎడ్ల కుర్మయ్య నాయకత్వంలో కార్యక్రమం సాగింది. విద్య, ఉద్యోగాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు అయితే సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తాయని వారు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన పూర్తి చేసి 42 రిజర్వేషన్ల కోసం రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపినా ఇప్పటికీ ఆమోదం లభించకపోవడాన్ని వారు విమర్శించారు. జీవో నెం.9 ద్వారా స్థానిక ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నించగా కేంద్రం ప్రభావంతో కోర్టుల్లో అడ్డంకులు సృష్టించబడుతున్నాయని అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాల కారణంగానే బీసీ రిజర్వేషన్ల అమలు నిలిచిపోయిందని వారు పేర్కొన్నారు. బీసీల హక్కుల కోసం అన్ని సంఘాలు ఐక్యంగా ఉద్యమాలు నిర్మించి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్

## తెలంగాణ చరిత్రను నలుదిశల చాటాలి

**నారాయణ పేట, నవంబరు 16 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం తెలంగాణ చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 60 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన లైబ్రేరియన్ శిల్ప వ్యాసరచన పోటీలు విద్యార్థుల మేధాశక్తి పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. సంస్కృతి, సాంప్రదాయం చరిత్రపై అవగాహన పెంపొందించడంతో పాటు జ్ఞానోదయానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని చెప్పారు. తెలంగాణ చరిత్రలోని విశిష్ట గాథలను విద్యార్థులు లోతుగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. చరిత్రను తరతరాలకు పరిచయం చేయడంలో పాఠశాలలు గ్రంథాలయాలు కీలక వేదికలని శిల్ప పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ద్వారా చదువు అభిరుచి పెంపొందించడం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు ఇతరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

## ఎస్సై ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

**-తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**కల్వకుర్తి, నవంబర్ 16 ప్రభాతవార్త:** ఉప్పల చారిటబుల్ ట్రస్టు సహకారంతో నందు ఆర్మీ అకాడమీలో శిక్షణ పొంది సతీష్‌రెడ్డి, హేమలతలు ఎస్ఐలుగా ఉద్యోగం సాధించారు. ఎస్ఐలుగా ఉద్యోగం పొందిన సతీష్‌రెడ్డి, హేమలతలు ఆదివారం హైదరాబాదులో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ నివాసంలో కృతజ్ఞత భావంతో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. అనంతరం ఉప్పల వెంకటేష్ ఉద్యోగం సాధించిన ఎస్ఐలను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ మీరు సమాజ సేవకు, పేద ప్రజలకు న్యాయం జరిగే విధంగా, మీరు పేద మధ్యతరగతి విద్యార్థులకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందు అకాడమీ చైర్మన్ నందు, మాజీ జెడ్పిటిసి నరసింహ, బుచ్చిబాబు, నరేందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐలను సన్మానిస్తున్న ఉప్పల వెంకటేష్

## మాంటిస్సోరిలో బాలల దినోత్సవ వేడుకలు

**గద్వాల టౌన్ , నవంబర్ 16, ప్రభాతవార్త:** అలంపూర్ మాంటిస్సోరి పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలల సాంస్కృతిక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన ఆంగ్ల రూపకాలు ప్రేక్షకుల హృదయాలను కట్టిపడేశాయి. "శశిరేఖా పరిణయం తెలుగు నాటకం కళాత్మకతతో అందరినీ అబ్బురపరిచింది. విద్యార్థులు చేసిన నృత్యావిష్కరణలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. అన్నమయ్య కీర్తనలు సర్వాన్నీ అలరించాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి. నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, కృషి, నిబద్ధతతో కూడిన విద్యనే జీవితంలో ఉన్నత ఫలితాలకు పునాది అవుతుందని విద్యార్థులను ప్రేరేపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




బాలల దినోత్సవ కార్యక్రమంలో ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

## సీసీ రోడ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

**రాజాపూర్, నవంబరు 16 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల కేంద్రంలోని పలు కాలనీలలో సీసీ రోడ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తూ ఆదివారం రాజాపూర్ మండల కేంద్రానికి విచ్చేసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు విన్నవించారు. గ్రామంలోని ఆయా వార్డుల్లో సీసీ రోడ్లు లేనందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. దీనికి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పందిస్తూ త్వరలోనే సీసీ రోడ్ల మంజూరుకు తనవంతు కృషి చేస్తానని వారికి హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ జవాజి శేఖర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్ నాయక్, కాంగ్రెస్‌పార్టీ గ్రామ అధ్యక్షులు గోనెల రమేష్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, భరత్‌రెడ్డి, విక్రంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గిరిగౌడ్, పంచాయతీ కార్యదర్శి జైపాల్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

## మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం : ఎమ్మెల్యే

**జడ్చర్ల, నవంబరు 16 ప్రభాతవార్త:** జడ్చర్లలోని అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ కరాటే లీగ్ - 2025 కార్యక్రమానికి ఆదివారం జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కరాటే లీగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత సామర్థ్యాలను వెలికితీసే క్రీడా కార్యక్రమాలు, ముఖ్యంగా మార్షల్ ఆర్ట్స్ వంటి శారీరక మానసిక శక్తిని పెంపొందించే శిక్షణలు విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. కరాటే యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, స్వీయ రక్షణ నైపుణ్యాలను పెంపొందించే శక్తివంతమైన క్రీడ అని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో క్రీడల అభివృద్ధికి సమగ్ర ప్రోత్సాహం అందిస్తున్నామని, ప్రతిభను గుర్తించి ముందుకు తేవడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. జడ్చర్లలో క్రీడా మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి యువతకు మంచి అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న చిన్న పిల్లలు, విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు.



మార్షల్ ఆర్ట్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి

# మండిపోతున్న కూరగాయల ధరలు

## వర్షాల దెబ్బతో కూరగాయల మార్కెట్లలో మంటలు

**ధన్వాడ, నవంబరు 16 ప్రభాతవార్త :** ధన్వాడ మార్కెట్లలో కూర గాయల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. రోజువారీ వినియోగ వస్తువులే సామాన్య ప్రజలకు అందనంత దూరంగా మారాయి. ఏ కూరగాయ తీసుకున్నా పావుకేజీ రూ.30 దాటిపోగా, పలు రకాల కూరగాయలు కేజీకి రూ.100 నుండి రూ.120 వరకు అమ్ముడవు తున్నాయి. ఈ ధరల పెరుగుదలతో గృహిణులు, సామాన్య వేతన జీవులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరిగిన ధరలతో వారపుసంతల్లో, రైతు బజార్లలో కొనుగోలు దారులు తగ్గిపోయారు. టమోటా, వంకాయ, బీరకాయ, దొండకాయ, బెండకాయ వంటి కూరగాయల ధరలు గణనీయంగా పెరిగాయి. కొన్నింటికి కేజీ రూ.100 దాటగా, ఆకుకూరలు ముఖ్యంగా పాలకూర, ముల్ల కూర, మెంతికూర వంటివి కూడా ఒక్క కట్ట రూ.20-25 వరకు పలుకుతున్నాయి. వ్యాపారులు చెబుతున్న వివరాల ప్రకారం, ఇటీవల భారీ వర్షాల ప్రభావంతో కూరగాయల పంటలు విస్తారంగా నష్టపోయాయి. మట్టిలో తడిసిన పంటలు కోతకు పనికి రాకపోవడంతో సరఫరా తగ్గిందని, అందువల్లే ధరలు పెరిగాయని వారు చెబుతున్నారు. మరోవైపు రవాణా ఖర్చులు కూడా పెరగడం, పెట్రోల్-డీజిల్ రేట్లు అధికంగా ఉండటంతో రవాణాదారులు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలు మాత్రం ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. కూరగాయలు తినడం కూడా ఇప్పుడు విలాసం అయింది. జీతం అంతా కూరగాయలకే వెళ్తోంది" అని గృహిణులు వాపోతున్నారు. మార్కెట్ యార్డ్ అధికారులు, వ్యవసాయ విభాగం కలిసి సరఫరాను పెంచే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ధరల స్థితి ఇలా ఉంది టమోటా: రూ.70 కేజీవంకాయ: రూ.110 కేజీదొండకాయ: రూ.90 కేజీబీరకాయ: రూ.100 కేజీబెండకాయ: రూ.110 కేజీపాలకూర కట్ట: రూ.25 తాత్కాలికంగా తుఫాన్ ప్రభావం తగ్గాక సరఫరా సవ్యంగా జరిగితే ధరలు తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. కానీ అప్పటి వరకు ప్రజలకు కూరగాయల వేట మాత్రం కొనసాగనుంది.



కూరగాయలు తెంపుతున్న రైతు బోయ నర్సింలు

**పంటలు నీటిలో మునిగిపోయాయి..**

అందుకే కూరగాయలు బంగారం అయ్యాయి రైతు వేదఇటీవలి వర్షాల కారణంగా కూరగాయల పంటలు పెద్దఎత్తున నష్టపోయాయి. పొలాలు తడిసి మట్టిలోనే పంటలు కుళ్లిపోవడంతో సరఫరా తగ్గిపోయిందని రైతు చెబుతున్నారు. మేము విత్తనాలు, ఎరువులు, కూలీలకు డబ్బులు పెట్టాం... కానీ పంట కోతకు ముందే వర్షం కురిసింది. టమోటా, బీరకాయ పంటలు నేలమట్టమయ్యాయి. మిగిలినవి మార్కెట్‌కి తీసుకెళ్లేవరకు కూడా పాడైపో తున్నాయి" అని యంనోని పల్లి రైతు బోయ నర్సింలు వాపోతున్నారు.



యంనోనిపల్లి రైతు బోయ నర్సింలు

**కూరగాయలు కొనడమే కష్టమైంది...**

కూలి చేసిన కష్టం అంతా మార్కెట్‌కే. ముందు వారం రూ.200తో వారం రోజుల కూరలు తెచ్చేవాళ్లం. ఇప్పుడు అదే డబ్బుతో రెండు రోజులు కూడా సరిపోవడం లేదు," అని కూరగాయల దుకాణం దగ్గర నిలుచున్న గృహిణి మణెమ్మ వాపోయింది.



పాతపల్లి నివాసి మన్నెమ్మ

# వీడిన ఎనమనగండ్ల యువకుడి హత్య మిస్టరీ

### దళితుడైనందుకే పగతో అన్నను కిడ్నాప్ చేసి హత్య

**నవాబుపేట, నవంబరు 16 ప్రభాతవార్త :** వేరే కులం యువకుడు తన కూతురిని తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడన్న కక్షతో రగిలిపోయిన అమ్మాయి తండ్రి ఆ యువకుడి అన్నను అపహరించి దారుణంగా హత్య చేశాడు. ఈ కులోన్మాద హత్య మహబూబ్ నగర్ జిల్లా నవాబుపేట మండలం పరిధిలోని ఇనుమనుగండ్ల శివారులో జరిగింది. రంగా రెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద శివారు ఎల్లంపల్లి గ్రామానికి చెందిన కాగుల వెంకటేశ్ కూతురు (18) భవాని, అదే గ్రామానికి చెందిన దళిత యువకుడు చంద్రశేఖర్ (25)తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారి తరచుగా ఫోన్లో మాట్లాడుకునేవారు. చంద్రశేఖర్ ఆటో నడుపుకొంటున్నాడు. నెలక్రితం రహస్యంగా ఇద్దరు వివాహం చేసుకున్నారు. ఇది తెలిసి భవాని కుటుంబ సభ్యులు షాద్నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమక్షంలో అమ్మాయి, అబ్బాయి వేర్వేరుగా ఉండేలా పెద్దల మధ్య ఒప్పందం కుదిరింది. అయితే ఫోన్లో మాత్రం అమ్మాయి, అబ్బాయి మాట్లాడుకుంటున్నారు. ఇటీవల ఇద్దరూ కలిసి ఊర్లో నుంచి వెళ్లిపోయారు. ఇది తెలిసిన భవాని తండ్రి ఆవేశానికి గురై తన అనుచరులతో చర్చించి వారికి మద్యం తాగించి యువకుని హత్యకు కుట్ర చేశారు. చంద్రశేఖర్, భవానీలను వెతికిన ప్రయోజనం లేకపోవడంతో చంద్రశేఖర్ అన్న రాజశేఖర్ (30) తన భార్యతో కలసి షాద్‌నగర్లోని అయ్యప్ప కాలనీలో ఆరేళ్లుగా అద్దెకు ఉంటున్నాడు. తన కూతురును చంద్రశేఖర్ తీసుకెళ్లడంతో దళితుడు నా కూతుర్ని తీసుకుపోతాడా అని కోపంతో రగిలిపోయిన వెంకటేశ్ బుధవారం రాత్రి కొందరిని వెంటేసుకొని షాద్‌నగర్‌కు వెళ్లాడు. రాజశేఖరును ఇంట్లో నుంచి బలవంతంగా తీసుకెళ్లాడు అతడిని అదేరోజు రాత్రి మహబూబ్‌గర్ జిల్లా నవాబుపేట పరిధిలోని ఎనమనగండ్ల యన్మనగండ్ల శివారులో హత్యచేశారు. మృతదేహాన్ని పెట్రోలు పోసి కాల్చివేశారు. కిడ్నాప్ జరిగిన రోజే మృతుడి భార్య వాణి షాద్‌గర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మృతుడి కుటుంబసభ్యులు తెలిపారు. భవాని, చంద్రశేఖర్ అచూకీ లభించలేదు. చాలా మందికి సామజిక అవగాహన లేక ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుంది. ఇతర దేశాలు టెక్నాలజీ మీద ముందుకు దూసుకుపోతుంటే, మన దేశం మాత్రం కులాల మీద ఒకరికొకరు ప్రాణాల మీదికి పోవడంలో ముందుకు పోతున్నది. ఏదేమైన ఒక ప్రాణం తీయడం పరిష్కారం కాదు, పోయిన ప్రాణం తిరిగి తీసుకు రాలేం. తన భార్య పిల్లలు రోడ్డు మీద పడే పరిస్థితి, దయచేసి మరలా ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే, పోలీసు వ్యవస్థ దయచేసి ఇట్టి విషయాలపై గ్రామాల్లో సామాజిక స్పృహ, అవగాహనా తీసుకురావాలని కోరుకుంటున్నారు.

## 18న బాలభవన్‌లో యువజనోత్సవాలు

**గద్వాల టౌన్ , నవంబర్ 16, ప్రభాతవార్త:** స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అనుమతితో ఈనెల 18న గద్వాల బాలభవన్ లో జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జానపద నృత్యం చేసేందుకు, జానపద గీతాలు ఆలపించేందుకు పదిమంది సభ్యులతో కూడిన మహిళలు, పురుషులు వేరువేరుగా కానీ, కలిసి గానీ ఒక బృందంగా పోటీ పడవచ్చు అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయం ప్రతిబింబించేలా నృత్య ప్రదర్శనలు ఉండాలని 15 నిమిషాలకు మించరాదన్నారు. అలాగే ఏడు నిమిషాలలోపే పాటలు పాడవలసి ఉంటుందని, సినిమా పాటలకు అనుమతి లేదని చెప్పారు. కథా రచన, చిత్రలేఖనం, కవిత్వ రచన, ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళ, ఉపన్యాస పోటీలు కూడా నిర్వహించడం జరుగుతుందని వివరించారు. యువజన ఉత్సవాల్లో జిల్లాకు చెందిన 15 నుంచి 29 సంవత్సరాల లోపు యువత పాల్గొనేందుకు అవకాశం ఉందన్నారు. జిల్లా స్థాయిలో ఆయా విభాగాల్లో ప్రథమ స్థానం సాధించిన యువతీ, యువకులు త్వరలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. రాష్ట్రస్థాయిలోనూ ప్రథమ స్థానం సాధించిన వారిని 2026 జనవరి 10 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొను కళాకారులు ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల వరకు మెయిల్ ద్వారా లేదా 9963625218 నంబర్ కు వాట్సాప్ లో తమ వివరాలు పంపించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న యువతి, యువకులు నవంబర్ 18న పోటీలకు హాజరయ్యేటప్పుడు తమ ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం (ఎస్ఎస్సి మెమో జిరాక్స్), రెండు కలర్ ఫోటోలను వెంట తీసుకురావాలని సూచించారు.

## అధ్వానంగా నారాయణపేట-మక్తల్ రహదారి దుస్థితి

**నారాయణపేట, నవంబరు 16 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రం నుండి మక్తల్‌కు వెళ్లే 30 కిలోమీటర్ల రహదారి పూర్తిగా అధ్వానంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలమూరుకు సులభంగా చేరుకోగలిగినా కేవలం 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మక్తల్‌కు చేరడంలోనే ప్రజలు నరకయాతన అనుభవించడం పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలియజేస్తోంది. నారాయణపేట సింగారం మార్గం నుండి మక్తల్ వైపు ప్రయాణిస్తే రహదారి గుంతలతో నిండిపోవడంతో వాహనదారులకు దినసరి ఇబ్బందులు తప్పడంలేదు. మక్తల్ ఎస్బిఐ రోడ్డులో భారీ గుంతలు ఉండడంతో ప్రతి రెండు రోజులకో భారీ వాహనం వాటిలో ఇరుక్కుంటోంది. రోజూ వేలాది వాహనాలు ఈ మార్గంలో ప్రయాణించగా అనుమతికి మించి టిప్పర్లు ఓవర్‌లోడ్ అయ్యే కారణంగా రహదారి పూర్తిగా ధ్వంసమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయదారులు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై వచ్చే ప్రజలు తీవ్ర కుదుపులు ప్రమాదాలను ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరమ్మతుల కోసం ఎటువంటి చర్యలు కనిపించకపోవడంతో స్థానికుల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఇప్పటికైనా నాయకులు జోక్యం చేసుకుని రహదారి సమస్యను పరిష్కరిస్తారా లేదా అన్ని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



అధ్వానంగా మారిన నారాయణపేట-మక్తల్ రహదారి

## కాలం చెరపలేనిది కమ్యూనిస్టు చరిత్ర

**నారాయణ పేట, నవంబరు 16 ప్రభాతవార్త :** సమాజ మార్పుకోసం కమ్యూనిస్టు పార్టీ నిరంతరంగా పోరాడుతుందని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాల నరసింహ ఖమ్మంలో డిసెంబర్ 26న జరిగే సిపిఐ వందేళ్ల ముగింపు ఉత్సవాల ప్రచార బస్సు జాతా మక్తల్ మరికల్ నర్వ మార్గంగా పేట చేరుకోగా జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కళా ప్రదర్శన నిర్వహించి బస్సు జాతాను ప్రజలకు పరిచయం చేశారు. బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పోరేట్లకు అప్పగించి ఆర్థిక అసమానతలను పెంచుతుందని ఎమ్మెల్సీ సత్యం విమర్శించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల అసలు సమస్యల నుంచి దృష్టిని మళ్లించడం కేంద్ర ప్రభుత్వ వ్యూహమైందన్నారు. సమాజంలో అంతరాలు ఉన్నంతవరకు ఎర్రజెండా పోరాటం ఆగదని స్పష్టం చేశారు. బాలనరసింహ మాట్లాడుతూ జిల్లా వలస-కరువులతో బాధపడుతుండగా పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి వెనుకబడిందన్నారు. ప్రజలు మేలుకొని కమ్యూనిస్టు పార్టీ పోరాటాలకు తోడ్పడితేనే ప్రాంత అభివృద్ధి సాధ్యమని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే శక్తి కమ్యూనిస్టు పార్టీకే ఉందని ఖమ్మం వందేళ్ల మహోత్సవాలకు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.



ప్రచార బస్సు జాతాకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

## అనుమానస్పదంగా యువకుడు మృతి

**వెల్దండ, నవంబర్ 16 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని రాచూరు గ్రామానికి చెందిన కొంగళ్ళ శివకుమార్ (25) అనుమానస్పదంగా మృతి చెందారు. వివరాలకు వెళితే శివకుమార్ శనివారం మధ్యాహ్నం వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు కొనుగోలు చేసి తీసుకొని రావడానికి కల్వకుర్తికి బయలుదేరి వెళ్లాడని రాత్రి వరకు కూడా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంతకు వెతికిన ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని కటిక జంగోజీకి చెందిన వ్యవసాయ పొలం వద్ద అనుమానస్పద స్థితిలో శివకుమార్ మృత దేహం పడి ఉండడంతో చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి సిఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఐ కురుమూర్తిలు చేరుకొని పరిశీలించారు. మృతుడు శివకుమార్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడికి భార్య ఉన్నారు.



మృతి చెందిన శివకుమార్

## గోప్లాపూర్‌లో వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



గోప్లాపూర్‌లో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

**భూత్పూర్, నవంబర్ 16, ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని గోప్లాపూర్‌లో జరిగిన వడ్డె చిట్టిబాబు కూతురు వివాహానికి హాజరై నూతన వధూవరుల్ని ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వెంట బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, టి మురళిధర్‌గౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి, సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్, సత్తూర్ అశోక్‌గౌడ్, మేకల సత్యనారాయణ, మేకల గౌరయ్య పాల్గొన్నారు.

## భూత్పూర్ శివాలయంలో నేడు కార్తీక వనభోజన కార్యక్రమాలు

**-బీఆర్ఎస్ నేత టి మురళిధర్‌గౌడ్**

**భూత్పూర్, నవంబర్ 16, ప్రభాతవార్త :** ఎనిమిది వందల శతాబ్దాల చరిత్ర కల్గిన భూత్పూర్ శ్రీరామలింగేశ్వరాలయంలో ద్దాదశ కార్తీక మాస ఆఖరిసోమవారం సందర్భంగా ఉసిరి చెట్టు వద్ద కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి మురళిధర్‌గౌడ్ తెలిపారు. కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా భక్తులకు ఈవనభోజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్తీక వనభోజన కార్యక్రమాల్లో పాల్గొనాలని టీఎం గౌడ్ కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**కల్వకుర్తి, నవంబర్ 16 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలంలోని బెక్కర గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, శ్యాముల్‌రెడ్డిలు శనివారం రాత్రి కల్వకుర్తి నుంచి ద్విచక్రవాహనంపై తమ స్వంత గ్రామం బెక్కరకు వెళ్తుండగా కల్వకుర్తి-నాగర్ కర్నూల్ రోడ్ తుర్కపల్లి గేట్ వద్ద ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో కృష్ణారెడ్డి, శ్యాముల్‌రెడ్డిలు తీవ్రంగా గాయాలు కాగా అటుగా వెళుతున్న వాహనదారులు ప్రమాదాన్ని గమనించి 108కు సమాచారమివ్వడంతో గాయపడిన వారిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన కృష్ణారెడ్డి చికిత్స పొందుతూ మృతిచెందారు. శ్యాముల్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కృష్ణారెడ్డి (ఫైల్)

## ప్రమాదాలను అరికట్టడమే ప్రధాన లక్ష్యం



ముళ్ళ పొదలను తొలగిస్తున్న దృశ్యం

**గద్వాల టౌన్ ,నవంబర్ 16, ప్రభాతవార్త:** రోజు రోజుకి జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే ప్రధాన లక్ష్యమని బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు మహేష్ నాయుడు అన్నారు. అలంపూర్ మండల పరిధిలోని లింగన్నవాయి గ్రామం నుండి ఇమాంపురం వరకు ఉన్న బీటీ రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ లను ఆదివారం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో తన సొంత ఖర్చులతో జెసిబి ద్వారా ముళ్ళ పొదలను తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా మహేష్ నాయుడు మాట్లాడుతూ.. రోడ్డుకిరువైపులా ముళ్ళపొదలు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రయాణికులు, గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు తొలగించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో మానవతా దృక్పథంతో పనిచేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. గ్రామీణ అభివృద్ధికై పాటుపడుతున్న మహేష్ నాయుడుకు గ్రామీణ ప్రజలు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, మల్లికార్జున, చైతన్య యాదవ్, ఎల్ఐసి మద్దిలేటి, బాలరాజు, జగన్, మరియు పంచాయతీ సిబ్బంది రఘు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ వర్గాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్లలో బీసీ సామాజిక న్యాయ ధర్మదీక్షకు మద్దతు**

**జడ్చర్ల, నవంబరు 16 ప్రభాతవార్త:** జడ్చర్ల కేంద్రంలో బీసీ జాగృతి సేన బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక న్యాయ ధర్మదీక్ష కార్యక్రమంలో జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ హక్కుల కోసం చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే స్వయంగా సంతకం చేసి తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ బీసీ వర్గాల సామాజిక న్యాయం కోసం చేపట్టిన ఈ ధర్మదీక్ష ఎంతో సముచితమైనదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీసీలకు సమాన అవకాశాలు, న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుదల, ప్రభుత్వంలో సముచిత భాగస్వామ్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీసీ జాగృతి సేనబీసీ జేఏసీ చేస్తున్న అవగాహన కార్యక్రమాలు సమాజ అభివృద్ధికి దోహదం చేస్తాయి" అని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి వర్గానికి న్యాయం జరుగేలా కృషి చేస్తామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు, జాగృతి సేన ప్రతినిధులు, యువకులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అండర్ 14 క్రికెట్‌క ఎంపికైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థి చరణ్

*నారాయణ పేట, నవంబరు 16 ప్రభాతవార్త :* నారాయణ పేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి చరణ్ ప్రతిభ చాటి మహబూబ్‌నగర్ జిల్లా అండర్ 14 క్రికెట్ సెలెక్షన్ ట్రయల్స్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. తన అద్భుత ఆటతీరుతో అందరినీ ఆకట్టుకున్న చరణ్‌ను పీడీ అక్తర్ పాషా అభినందించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం చరణ్ రాష్ట్రస్థాయిలో మంచి ఫలితాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. డిసెంబర్‌లో భద్రాచలం వేదికగా జరుగనున్న రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌లో ఆయన ప్రతినిధిగా పాల్గొననున్నాడు. స్థానిక క్రీడా వర్గాలు గురువులు తల్లిదండ్రులు చరణ్ సాధనపై ఆనందం వ్యక్తం చేశారు. చిన్న వయస్సులోనే ప్రతిభ చాటుతున్న చరణ్ భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో రాణించాలనే ఆకాంక్ష అందరిలో కనిపిస్తోంది. ఈ విజయంతో నారాయణ పేట ప్రాంతానికి గర్వకారణంగా నిలిచిన చరణ్‌కు శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది.




విద్యార్థి చరణ్‌ను అభినందిస్తున్న దృశ్యం

## ఆలయ ప్రారంభోత్సంలో మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్

**మహబూబ్‌నగర్, నవంబర్ 16,ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎంప్లాయిస్ కాలనీ రోడ్ నెంబర్ 7లో శ్రీ శ్రీ శివపార్వతుల నూతన దేవాలయ నిర్మాణం ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. మహబూబ్‌నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ దేవాలయం నిర్మాణం కోసం స్థలం అందించిన స్థలదాత భూపాల్ రావుకు కాలనీ వాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వేదమంత్రాల నాదంతో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దేవాలయం ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణం పూర్తై, తొందరలో ప్రజల సేవలో నిలవాలని అందరూ పూజలు నిర్వహించారు.



పూజలు నిర్వహిస్తున్న ఆనంద్‌గౌడ్

## భక్తిశ్రద్ధలతో అన్నదానం

**- పాల్గొన్న మిథున్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్**

**మహబూబ్‌నగర్, నవంబర్ 16,ప్రభాతవార్త:** శబరిమల అయ్యప్ప స్వామి అనుగ్రహం కోసం ప్రతి ఏటా "కార్తీక్ మాస పర్వ దినం" పురస్కరించుకొని అయ్యప్ప స్వామి దీక్షలు ప్రారంభమవుతాయి. అందులో భాగంగానే అయ్యప్ప స్వామి మాలధారణ స్వీకరించిన స్వాములకు "నిత్య అన్నదానం"ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు... స్వామి వారి పూజా కార్యక్రమం అనంతరం అయ్యప్ప స్వాములు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి అన్నప్రసాద వితరణలో భాగంగా మిథున్ రెడ్డి అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులను ఏపి మిథున్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ గారు, ఆలయ కమిటీ సభ్యులు, గురుస్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న మిథున్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్

## పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలి

**- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి**

**మహబూబ్‌నగర్, నవంబర్ 16, ప్రభాతవార్త** : పుస్తకాలు చదివే అలవాటు ప్రతి ఒక్కరూ చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గ్రంథాలయాలను సందర్శించి పుస్తకాలను చదవే అలవాట్లు నేర్చుకోవాలని, తాము ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించుటకు పుస్తకములను శ్రద్ధగా చదివి జీవిత లక్ష్యాన్ని చేరుకోవాలని, నిరుద్యోగులకు కావలసిన వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను తెప్పించి అందుబాటులో ఉంచామని వారికి కావాల్సిన వసతులను కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, గ్రంథాలయ పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.




పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న నర్సింహ్మా

# ఆ మద్యం షాప్‌కు .. రీ టెండర్

**- 19న మహబూబ్‌నగర్ కలెక్టరేట్లో లక్కీడ్రా**

**- మహబూబ్‌గర్ 16వ షాప్‌నకు టెండర్**

**వేసిన వారు పాల్గొనాలని అధికారుల సూచన**

**మహబూబ్‌గర్ బ్యూరో, నవంబర్ 16 ప్రభాతవార్త:** మహబూబ్‌గర్ జిల్లాలోని 16వ నెంబర్ మద్యం దుకాణానికి ఈనెల 19న రీ టెండర్ నిర్వహించనున్నారు. ఇటీవల జరిగిన మద్యం టెండర్ల లో ఇదే షాపుకు సంబంధించి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు టెండర్ వేసిన సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వ ఉపాధ్యాయులు టెండర్లలో పాల్గొనడం నిబంధనల విరుద్ధంగా ఉండడం వల్ల ఉపాధ్యాయురాలని సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సదరు ఉపాధ్యాయురాలు తనకు మద్యం షాపు వద్దు అని తాను తిరిగి వీధుల కు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 16వ నెంబరు షాపుకు సంబంధించి రిటెండర్ నిర్వహించనున్నారు. ఈ షాపునకు 29 మంది టెండర్లు వేశారు. అయితే సదరు ఉపాధ్యాయురాలు విరమించుకున్న నేపథ్యంలో 28 మందికి సంబంధించి తిరిగి టెండర్లో పాల్గొననున్నారు. ఈ మేరకు ఈనెల 19న మహబూబ్నగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ విజయేంద్ర బోయి సమక్షంలో 28 మంది మద్యం టెండర్ దారులను పిలిపించి లక్కీ డ్రా తీయనున్నారు. లక్కీ డ్రా లో గెలుపొందిన వారికి ఆ మద్యం షాపు కేటాయించనున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ టెండర్ లో ఆ షాపునకు టెండర్ వేసిన 28 మంది తప్పక హాజరు కావాలని అధికారులు తెలిపారు.



**పైసలు పోయి...రిమార్కు వచ్చే..**

మహబూబ్‌గర్ 16వ షాపుకు సంబంధించి ఉపాధ్యాయురాలు పుష్ప మద్యం టెండర్ వేసి లక్కీ డ్రా లో టెండర్ పొందిన సంగతి తెలిసిందే. ఎక్సైజ్ శాఖ నిబంధనలకు సంబంధించి టెండర్లు ఎవరైనా వేయవచ్చు కానీ సర్వీస్ రూల్స్ ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయులు టెండర్ల వ్యవహారంలో పాల్గొనవద్దు అనే నిబంధన ఉన్న నేపథ్యంలో మహబూబ్నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ ఉపాధ్యాయురాలని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అప్పటికే సదరు ఉపాధ్యాయురాలు టెండర్ కోసం రూపాయలు మూడు లక్షలు కోల్పోవడమే కాకుండా లైసెన్సు ఫీజు కూడా సుమారు రూ.10 లక్షల వరకు చెల్లించినట్లు సమాచారం. ఈ క్రమంలో సదరు ఉపాధ్యాయురాలు 13 లక్షల రూపాయలు నష్టపోవడమే కాదు సర్వీస్ రూల్స్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో సస్పెన్షన్‌కు కూడా గురి కావడం గమనార్హం.

# 42% రిజర్వేషన్లు అమలు చేయాలి

**రిజర్వేషన్ అమలయ్యాకే ఎన్నికలకు వెళ్లాలి**

**కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి**

**బీసీ సంఘాల ధర్నా**

**మద్దతు పలికిన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్**

**జడ్చర్ల, నవంబరు 16 ప్రభాతవార్త:** బీసీ జాగృతి సేన, బీసీ జేఏసీ, బీసీ విద్యార్థి సంఘము ఆధ్వర్యంలో ఆదివారం సిగ్నల్‌గడ్డ ధర్నా చౌక్ దగ్గర చేపట్టిన సామజిక న్యాయం ధర్మ దీక్ష కార్యక్రమానికి మాజీ మంత్రి సి.లక్ష్మా రెడ్డి, శాసనసభ్యులు అనిరుద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ దీక్షాశిబిరం వద్దకు చేరుకొని మద్దతిచ్చారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని మద్దతుగా సంతకాలు చేశారు. కామరెడ్డి డిక్లరేషన్‌లోని ముఖ్య అంశాలైన స్థానిక సంస్థల ఎన్నికలలో, విద్యా ఉద్యోగాలలో బీసీలకు చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీల పోరాటానికి తమ పద్ధతి సంపూర్ణంగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ చట్టబద్ధత తో కూడిన 42 శాతం రిజర్వేషన్ల అమలు విషయమై ముఖ్యమంత్రితో మాట్లాడతానని తెలిపారు. బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణ యాదవ్, బీసీ జేఏసీ నాయకులు పిట్టల మురళి, ప్రణీల్ చందర్, శ్రీకాంత్, కౌన్సిలర్ ఉమా శంకర్ గౌడ్, నడిమింటి శ్రీనివాస్, చింతో జ్ రఘునందన చారి, వెంకటేష్, గొడుగు నర్సిములు, నిరంజన్‌లు మాట్లాడుతూ దీక్ష చేపట్టిన ఈ ప్రాంతంలోనే ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ జాతీయ నాయకుడు పార్లమెంటు సభ్యులు రాహుల్ గాంధీ స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఆ అమలుపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లే వర్షాకాల పార్లమెంటు సమావేశాలలో బీసీ రిజర్వేషన్ల గురించి చర్చించలేదని ఉన్నారు. రాష్ట్రంలో బీసీల జనాభా 50 శాతం పైగా ఉన్నా స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లను ఇస్తామన్నా ఒప్పుకున్నామని ఇచ్చిన హామీని అమలు చేయకుండా 50% సీలింగ్ విధానం సాకుతో ఎన్నికలకు వెళ్ళే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకొని చట్టబద్ధతతో కూడుకున్న 42 శాతం రిజర్వేషన్‌లను రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగ్రకుల పేదలకు 10% ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు అమలు చేసినప్పుడే 50% సీలింగ్ విధానాన్ని ఎత్తివేసారని అన్నారు. ఈ కార్యక్రమంలో రఘు నందన్‌చారి, నిరంజన్ గొడుగు నర్సిములు, లింగంపేట శేఖర్, మాచారం శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, శివరాములు, వెంకటేష్, గోపాల్, మాధవి, రాధిక, శివాని, శ్రావంతి, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.




మద్దతుగా సంతకం చేస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

## శ్రీ కురుమన్న ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలి

**చిన్న చింతకుంట, నవంబరు 16 ప్రభాతవార్త** : తెలంగాణ ప్రాంత పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా కొలవబడుతున్న శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం శ్రీ కురుమూర్తి స్వామిని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. కొండ దిగువన పార్టీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ఘన స్వాగతం పలుకుతూ శాలువాతో సత్కరించారు. కొండ దిగువన రాజగోపురం ముందు మాజీ ఎమ్మెల్యే ఆల సతీమణి ఆల మంజుల కర్పూర దీపాన్ని వెలిగించారు. అక్కడినుంచి నేరుగా ప్రధాన మెట్ల మీదుగా స్వామివారి సన్నిధికి చేరుకొని శ్రీ కురుమూర్తి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించి, ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పల్లెజనులు ఆరాధించే దేవుడైన శ్రీ కురుమూర్తి స్వామి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హర్షవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వట్టెం రాజేశ్వరి రాము, పార్టీ మండల అధ్యక్షులు కోట రాము, నాయకులు కరుణాకర్ రెడ్డి, అజయ్ కుమార్ రెడ్డి, రఘువర్ధన్ గౌడ్, అనిల్ గౌడ్, మల్లెల బాలరాజ్ కురుమూర్తి, రియాజ్ ,వివిధ మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అధ్వానంగా జాతీయ రహదారి దుస్థితి

**నారాయణపేట, నవంబరు 16 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రం నుండి మక్తల్‌కు వెళ్లే 30 కిలోమీటర్ల రహదారి పూర్తిగా అధ్వానంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగి స్తోంది. 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలమూరుకు సులభంగా చేరుకోగలిగినా కేవలం 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మక్తల్‌కు చేరడంలోనే ప్రజలు నరకయాతన అనుభవించడం పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలియజేస్తోంది. నారాయ ణపేట సింగారం మార్గం నుండి మక్తల్ వైపు ప్రయాణిస్తే రహదారి గుంతలతో నిండిపోవడంతో వాహనదారులకు దినసరి ఇబ్బందులు తప్పడంలేదు. మక్తల్ ఎస్బిఐ రోడ్డులో భారీ గుంత లు ఉండడంతో ప్రతి రెండు రోజులకో భారీ వాహనం వాటిలో ఇరుక్కుంటోంది. రోజూ వేలాది వాహనాలు ఈ మార్గంలో ప్రయాణించగా అనుమతికి మించి టిప్పర్లు ఓవర్‌లోడ్ అయ్యే కారణంగా రహదారి పూర్తిగా ధ్వంసమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయదారులు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై వచ్చే ప్రజ లు తీవ్ర కుదుపులు ప్రమాదాలను ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో సమస్యలు మరింత తీవ్రమ వుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరమ్మతుల కోసం ఎటువంటి చర్యలు కనిపించకపోవడంతో స్థానికుల్లో అసంతృప్తి పెరుగుతోం ది. ఇప్పటికైనా నాయకులు జోక్యం చేసుకుని రహదారి సమస్యను పరిష్కరిస్తారా లేదా అన్ని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

## వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలి

**ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి మీడియా**

**మాజీ మంత్రి లక్ష్మారెడ్డి**

**జడ్చర్ల, నవంబరు 16 ప్రభాతవార్త:** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిదిగా మీడియా వ్యవస్థ ఉండాలని, ఎల్లప్పుడూ ప్రజలకు వాస్తవాలు తెలియపరచాలని మాజీ మంత్రి బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డా. సి లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్లలో ప్రెస్ క్లబ్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ, సుల్తాన్ లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమానికి జడ్చర్ల మండల కేంద్రంలోని జర్నలిస్టులందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అధ్యక్షుడు కృష్ణ జడ్చర్ల ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులతో కలిసి మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని శాలువాతో సన్మానించారు.

## ఉడుగులకుంట్ల మైసమ్మ నాభిశిల మహోత్సవం

**పాల్గొన్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

**మహబూబ్‌నగర్, నవంబరు 16 ప్రభాతవార్త :** మహ బూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ ఉడుగులకుంట్ల మైసమ్మ నాభిశిల(బొడ్రాయి) ద్వితీయ వార్షిక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి ఆదివారం జరిగిన మైసమ్మ బోనాలు (బొడ్రాయి) సందర్భంగా మిథున్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకులు ఎన్.పి వెంకటేష్, మాజీ కౌన్సిలర్ చిన్న, శివకృష్ణ, శ్రీధర్ కాలనీ వాసులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్లైవాక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరులకు నివాళి

**జడ్చర్ల, నవంబర్ 16,ప్రభాతవార్త:** ప్లైవాక్ అసోసియేషన్ జడ్చర్ల ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన అమరులకు నివాళులర్పించారు. ఈమేరకు ఆదివారం ఉగ్రవాదుల కుట్రను భగ్నం చేసిన ఐపీఎస్ అధికారి బిజు సందీప్ చక్రవర్తి సేవలను కొనియాడారు. వాకర్స్ కలిసి డా.బిఆర్ఆర్ కాలేజ్ గ్రౌండ్ లో ర్యాలీ నిర్వహించారు.

శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల నవంబర్ 16: మండల పరిధిలోని అమ్మాపురం గ్రామంలోని ప్రసిద్ధ కురుమూర్తి స్వామి ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పూజారులు మాజీ ఎమ్మెల్యేకు ఆశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూత్పూర్ శివాలయంలో నేడు కార్తీక వనభోజన కార్యక్రమాలు

**-బీఆర్ఎస్ నేత టి మురళీధర్‌గౌడ్**

**భూత్పూర్,నవంబర్ 16,ప్రభాతవార్త :** ఎనిమిది వందల శతాబ్దాల చరిత్ర కల్గిన భూత్పూర్ శ్రీరామలింగేశ్వరాలయంలో ద్దాదశ కార్తీక మాస ఆఖరిసోమవారం సందర్భంగా ఉసిరి చెట్టు వద్ద కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి మురళీధర్‌గౌడ్ తెలిపారు. కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా భక్తులకు ఈవనభోజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్తీక వనభోజన కార్యక్రమాల్లో పాల్గొనాలని టీఎం గౌడ్ కోరారు.

# మహిళల భద్రతే లక్ష్యం

**- 28ఫిర్యాదులు..23కౌన్సెలింగ్‌లు.. - షీ టీమ్స్ భరోసా..**

**- వేధిస్తే సమాచారం ఇవ్వండి: మహబూబ్‌నగర్ ఎస్పీ జానకీ**

**మహబూబ్‌గర్ బ్యూరో, నవంబర్16 ప్రభాతవార్త:** మహిళలు, ఆడబిపిల్లలకు షీ టీం మేమున్నామంటూ భరోసినిస్తున్నది. మహిళలు, బాలికల భద్రత తెలంగాణ పోలీసుల ప్రధాన బాధ్యత అంటూ ముందుకు సాగుతున్నారు. అక్టోబర్ నెలలో ఏఐటీయూ, షీ టీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిఘా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. స్కూళ్లు, కళాశాలలు, గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒక్క అక్టోబర్ నెలలోనే మొత్తం 22 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 30హాట్‌స్పాట్ ప్రాంతాలు సందర్శించారు. సమాచారం సేకరణ కురుమూర్తి జాతరలో తప్పిపోయిన పిల్లలు, వృద్ధులను గుర్తించి కుటుంబాలకు అప్పగింపు మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాలు, బాల కార్మికత్వం, అవయవ విక్రయం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ వచ్చారు.

**ఒక్క కాల్‌తో ఆకతాయిల ఆటకట్టు..**

ఎవరైన ఆకతాయిలు ఎక్కడైనా బస్టాప్, ఇండ్ల వద్ద, దుకాణాల వద్ద, షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఇబ్బందులకు గురి చేసినా అసహ్యంగా ప్రవర్తించినా, 8712680066/100 షీ టీమ్స్ విభాగానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇప్పటికే అందిన వాటిలో 28 ఫిర్యాదులు, 23కౌన్సిలింగ్, 21రెడ్ హ్యాండెడ్ కేసులు, ఎఫ్ఐఆర్ 5, ఈ పెట్టీ కేసులు 2 అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 16హాట్‌స్పాట్ విజిట్స్ - 86, విద్యాసంస్థల్లో ర్యాగింగ్, ఇవిటీజింగ్, పాక్సో, సోషల్ మీడియా, సెల్ఫ్ డిఫెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఫిర్యాదుల కోసం షీ టీమ్ నంబర్: 8712659365 / డయల్ 100 ఎలాంటి వేధింపులకైనా గురైతే వెంటనే డయల్ 100 లేదా షీ టీమ్ నంబర్‌కి సమాచారమివ్వాలని, ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు.

**మీకు మేమున్నాం..**

వేధిస్తే డయల్ 100కు ఫిర్యాదు చేయండి. ఎవరైనా వేధిస్తే డయల్ 100కు ఫిర్యాదు చేయండి. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఆకతాయిల ఆటకట్టించేందుకు పోలీస్ యంత్రాంగం అంతామీకు అండగా ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా పోలీసులు, షీ టీం బృందాలు మఫ్టీలో ఉన్నారు. సీసీ కెమెరాల ద్వారా కూడా నిఘా ఉంచాం. అమ్మాయిలను వేధిస్తే జైలుకు పంపుతాం. కఠిన చర్యలు ఉంటాయి.

– మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకీ



